



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 286 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 19 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :286 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 19 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur







## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు..

### 'కోస్తా గ్రీన్ బెల్ట్'పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష

- అటవీ, పర్యాటక ఉన్నతాధికారులతో పవన్ సమీక్షా సమావేశం
- గ్రీన్ జోన్స్ ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చన్న పవన్
- స్థానిక ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని సూచన

- మిగతా 2లో



## గాదె సాయికృష్ణ ఘటనపై సీబీఐ ఎంక్వైరీ జరగాలి

పెన్ పవర్ డెస్క్:ఏపీలోని విజయవాడలో గాదె సాయికృష్ణ అనే యువకుడి లాకప్ డెత్ దుమారం రేపి న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పోలీసు ల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ( జూన్ 18 ) వైసీపీ అధినేత జగన్ గాదె సాయికృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు జగన్. గాదె సాయి కృష్ణ ఘటనపై సీబీఐ ఎంక్వైరీ జరగాలని

- మిగతా 2లో

## తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ..


## మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూ

- తిరుపతిలో జేఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆఫ్-క్యాంపస్ ఏర్పాటు
- మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం
- 74 కోర్సులతో 10 వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత విద్య
- ప్రాజెక్టు ద్వారా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన
- ప్రతిష్ఠాత్మక నాక్ ఏంం గుర్తింపు పొందిన జేఎస్ఎస్ విద్యాసంస్థ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంలో విద్యా రంగం అభివృద్ధికి కీలక అడుగు పడింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రానుంది. మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర (జేఎస్ఎస్) మహావిద్యాపీఠం, తమ ఆఫ్-క్యాంపస్‌ను తిరుపతిలో

- మిగతా 2లో





## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'

## మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థినులందరికీ బంక్ బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయానికి నిర్ణయం
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో

- మిగతా 2లో

## విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!

- 9 మంది ఎంపీల్లో ముగ్గురే సమావేశానికి హాజరు
- ఢిల్లీలో నిర్వహించిన కీలక భేటీకి ఆరుగురు ఎంపీల గైర్హాజరు
- గైర్హాజరైన వారిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంజయ్ రౌత్
- సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లుని వ్యాఖ్య
- మిగతావాళ్లు ద్రోహులంటూ విమర్శలు
- వారు ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరనున్నారని జోరుగా ప్రచారం

- మిగతా 2లో





## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు.. ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!

- తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు
- రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం
- వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ
- ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు
- అవి సద్దుమణిగాకే ఇంధన ధరల్లో సవరణకు అవకాశం

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. ఇంధన ధరల నిర్ణయంలో ముడిచమురు

- మిగతా 2లో



## రైతు బీమా ఎగ్గొట్టే కుట్ర..

### 7,600 మృతుల కుటుంబాలకు బీమా డబ్బులు రాలేదు: జీవన్ రెడ్డి

- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తున్నారన్న జీవన్ రెడ్డి
- కాంగ్రెస్ నాయకులనే ప్రజలు కనుమరుగు చేస్తారని వ్యాఖ్య
- ఉన్న పథకాలను చెడగొట్టొద్దని హితవు

- మిగతా 2లో


## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్..

## సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

### హైకోర్టుకు తెలిపిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'గా రూపాంతరం చెందిందని, సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదులు, పరీక్షల అక్రమాలకు పాల్పడే ముఠాలకు ఇది అడ్డాగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు

- మిగతా 2లో




## పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే..

## చట్టసభ నిర్ణయాలను ప్రభావితం చేశారు

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

- ఐఎస్ఐ గుప్పిట్లోనే పాక్ చట్ట సభలు నడిచాయన్న ఖవాజా ఆసిఫ్
- ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్య
- ఏకంగా స్పీకర్ నివాసంలో అధికారిక సమావేశాల్లో పాల్గొనేవారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పాలన అనేది కేవలం ఒక ప్రహసనమని.. అక్కడ తెరవెనుక అంతా సైన్యం, నిఘా సంస్థల మాటే నడుస్తుందని అంతర్జాతీయ సమాజం ఎప్పటి నుంచో చెబుతున్న పచ్చి నిజం. ఇప్పుడు అదే నిజాన్ని స్వయంగా ఆ దేశ రక్షణ మంత్రే పార్లమెంట్ వేదికగా అంగీకరించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పాక్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' గుప్పిట్లోనే ఆ దేశ చట్ట సభలు నడిచాయంటూ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# యూపీలో ఎన్డీయే సరికొత్త వ్యూహాలు

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో సమాజ్ వాదీ పార్టీ ని లక్ష్యంగా చేసుకుని అధికార ఎన్డీయే కూటమి సరికొత్త వ్యూహాలకు తెరలేపింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పార్టీల ఎంపీలు చీలిపోయి ఎన్డీఏకు మద్దతు ప్రకటించడంతో యూపీలోనూ అదే తరహా రాజకీయాలు జరుగుతాయన్న చర్చ ప్రారంభమయింది. యోగి ఆదిత్యనాథ్ క్యాబినెట్‌లో మంత్రి, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్ చేసిన సంచలన వ్యాఖ్యలు యూపీ రాజకీయాల్లో పెను తుఫానును సృష్టించాయి. సమాజ్ వాదీ పార్టీకి చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ ఎంపీలు బీజేపీ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే ఎస్పీలో భారీ చీలిక రాబోతోందని ఆయన ప్రకటించారు. యూపీ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ తన సోషల్ మీడియా వేదికగా ఎస్పీ అగ్రనేత రామ్ గోపాల్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఒక రహస్య లేఖ సమర్పించారని ఆరోపించారు. యూపీని గతంలో కుదిపేసిన మైనింగ్ కుంభకోణం, గోమతి రివర్ ఫ్రంట్ స్కామ్‌ల మాస్టర్‌మైండ్ ఎవరో అందరికీ తెలుసని.. ఇప్పుడు ఆ కేసుల ఉచ్చు గట్టిగా బిగుస్తుండటంతో ఎస్పీ నేతల్లో ఆందోళన మొదలైందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల భయంతో , నియోజకవర్గాల నిధుల కోసమే స మొత్తం సమాజ్ వాదీ పార్టీ బీజేపీలో చేరేందుకు లోపాయకారీగా లైన్ క్లియర్ చేసుకుంటోందని, అందులో భాగంగానే 21 మందికి పైగా ఎంపీలు టచ్‌లోకి వచ్చారని రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి రాజ్‌భర్ చేసిన ఈ మైండ్ గేమ్‌పై సమాజ్ వాదీ పార్టీ అధినేత, లోక్‌సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవన్నీ కేవలం ఓటమి భయంతో బీజేపీ ఆడుతున్న చౌకబారు నాటకాలని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో యూపీ ప్రజలు బీజేపీకి గట్టి బుద్ధి చెప్పారని, ఆ పరాజయాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి మైండ్ గేమ్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 37 స్థానాలతో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన తమ పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, తమ పార్టీ ఎంపీలు ఎవరూ కూడా ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదని అఖిలేష్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చీలిక వస్తుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని అఖిలేష్ తిప్పికొడుతూ.. రాబోయే 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉమ్మడిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఏ విధంగానైతే మట్టికరిపించామో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములాతో యోగి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల మధ్య విభేదాలు సృష్టించి మైలేజ్ పొందాలని చూస్తున్న బీజేపీ పప్పులు ఉమ్మడి యూపీలో ఉడకవని, అసలైన ప్రజా సమస్యలైన నిరుద్యోగం, ఆరోగ్య రంగా పతనంపై మాట్లాడకుండా అధికార పక్షం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో శివసేన కి చెందిన ఎంపీలు షిండే వర్గంలో విలీనం అయ్యారు. రాజ్‌భర్ చేసిన ఈ వ్యాఖ్యలు యూపీ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. లోక్‌సభలో మేజిక్ ఫిగర్ దాటినప్పటికీ, విపక్షాల బలాన్ని మరింత కుంగదీయాలనే వ్యూహంతో బీజేపీ ఆపరేషన్ లోటస్ ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, అఖిలేష్ యాదవ్ తన ఎంపీలు, కేడర్‌ను కాపాడుకుంటూ 2027 పోరుకు ఎలా సిద్ధం కాబోతున్నారనేది రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల సరళిని శాసించనుంది

## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు.. 'కోస్తా గ్రీన్ బెల్ట్'పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో స్పీడ్ పెంచింది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహజ వనరులను వాడుకుంటూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నిరంతరం కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా... ఏపీకి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని అటు టూరిజం పరంగా, ఇటు పర్యావరణ పరంగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతోంది. ఏపీ కోస్తా తీరాన్ని శరవేగంగా అభివృద్ధి చేయడమే కాకుండా, పర్యావరణ రక్షణ కోసం 'కోస్తా గ్రీన్ బెల్ట్'ను విస్తరించేందుకు డిప్యూటీ పవన్ కల్యాణ్ నడుం బిగించారు. ఇందులో భాగంగా ఈరోజు సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తీర ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటి, హరిత వలయాలను (గ్రీన్ జోన్స్) ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చని, తుపానుల తీవ్రతను తగ్గించవచ్చని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనికోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ గ్రీన్ బెల్ట్ ప్రాజెక్ట్‌లో కేవలం ప్రభుత్వానిదే కాకుండా స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో సామాజిక అడవుల (ాశీఎఱఖ్రీ ఖీశీతీవర్‌తీఎ) పెంపకానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులకు స్పష్టం చేశారు.

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

- మొదటి పేజి తరువాయి

విన్నవించింది. నీట్–యూజీ 2026 రీ–టెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై విధించిన తాత్కాలిక నిషేధాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ రీ–టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించడంతో పాటు, పరీక్షను రద్దు చేసి పునర్నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, 'నీట్ మాఫియా' వంటి టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా మళ్లీ అక్రమాలు జరగకుండా నిరోధించేందుకే జూన్ 22 వరకు ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. టెలిగ్రామ్‌లోని ప్రైవసీ ఫీచర్లను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను గోప్యంగా ఉంచుతూ సులభంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఆరోపించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాల సరఫరా, ఉగ్రవాద ప్రచారం, సైబర్ దాడులు, ఆర్థిక మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు టెలిగ్రామ్ వేదికగా మారిందని పేర్కొంది. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయం భారతదేశంలోని సుమారు 150 మిలియన్ల వినియోగదారుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కొందరు నేరగాళ్ల చర్యల వల్ల వినియోగదారులందరినీ శిక్షించడం సరికాదని వాదించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, టెలిగ్రామ్‌కు ఎటువంటి తక్షణ ఊరట కల్పించలేదు. నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ తాత్కాలిక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

# బాదం పప్పు అవినీతి ఆరోపణల కలకలం..!

# ఏసీబీ దాడి తప్పించుకున్నారా..?

**బాదం పప్పు బాగోతాలు - ఎపిసోడ్ 21**

- ప్రైవేట్ సెటిల్‌మెంట్లు, కాల్ డేటా విచారణ..!
- బాదం పప్పు సర్వీస్ రికార్డులపై ఉన్నతాధికారుల దృష్టి
- రూరల్ అనుభవంతో ఆదాయ మార్గాలపై పట్టు..
- పట్టణ పోస్టింగ్ కోసం రాజకీయ పలుకుబడి వినియోగించారా..?
- రోజువారీ ప్రైవేట్ సెటిల్‌మెంట్లపై తీవ్ర ఆరోపణలు
- ఏసీబీ దాడి సమాచారం లీక్ అయ్యిందా..?
- కాల్ డేటా, మధ్యవర్తుల పాత్రపై విచారణ
- సర్వీస్ రికార్డుల పరిశీలనలో ఉన్నతాధికారులు

**తాడేపల్లిగూడెం ప్రాంతంలో విధులు నిర్వహించిన కాలంలో అక్రమ సెటిల్‌మెంట్లు, అవినీతి ఆస్తుల వ్యవహారాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారిపై మళ్లీ చర్చ మొదలైంది. ఏసీబీ దాడి సమాచారం లీక్ కావడంతో కీలక చర్యలు నిలిచిపోయాయన్న ప్రచారం నేపథ్యంలో ఉన్నతాధికారుల పరిశీలన కొనసాగుతున్నట్లు సమాచారం.**

**ఎడిటర్ పెన్ పవర్, భీమవరం జూన్ 18:**




తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గతంలో రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు మూడు సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన ఒక పోలీసు అధికారిపై ప్రస్తుతం తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక పరిస్థితులు, వివిధ ఆదాయ వనరులు, వివాదాల స్వభావంపై పూర్తిస్థాయి అవగాహన ఏర్పరుచుకున్న అనంతరం పట్టణ ప్రాంతంలో పోస్టింగ్ పొందేందుకు రాజకీయ ప్రభావాన్ని వినియోగించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ప్రభావశీల నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ, స్టేషన్ వ్యవహారాలపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. పై అధికారుల సూచనలను పక్కనబెట్టి, సహచర అధికారులు మరియు సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా, రోజుకు ఐదు నుంచి పది వరకు ప్రైవేట్ సెటిల్‌మెంట్లు నిర్వహించేవారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత గొడవలు వంటి అనేక అంశాల్లో మధ్యవర్తిత్వం పేరిట భారీ మొత్తాలు వసూలు చేసినట్లు ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాల ద్వారా కోట్ల రూపాయల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో, సుమారు పది రోజుల ముందు జరగాల్సిన ఏసీబీ దాడి చివరి నిమిషంలో విఫలమైందన్న వార్తలు కూడా చర్చనీయాంశమయ్యాయి. దాడికి సంబంధించిన సమాచారం ముందుగానే లీక్ కావడంతో ముగ్గురు పోలీసు అధికారులు అప్రమత్తమై చర్యల నుంచి తప్పించుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ సమయంలో దాడి విజయవంతమై ఉంటే సంబంధిత అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకునే పరిస్థితి వచ్చేదని

కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారానికి సంబంధించిన కాల్ డేటా రికార్డులు, మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మీడియా బ్రోకర్ల పాత్ర, ఆర్థిక లావాదేవీల వివరాలు తదితర అంశాలపై సమాచారం సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వివిధ ఫిర్యాదులు, ఆరోపణలు,

స్థానికంగా ప్రచారంలో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తూ ఉన్నతాధికారులు పూర్తి నివేదిక కోరినట్లు సమాచారం.

మరోవైపు, సంబంధిత పోలీసు అధికారి సర్వీస్ రికార్డులు, గత బదిలీలు, షోకాజ్ నోటీసులు, ఫిర్యాదుల చరిత్ర వంటి అంశాలను జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఆరోపణల నిజానిజాలు అధికారిక విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, ఈ వ్యవహారం ప్రస్తుతం పోలీసు శాఖతో పాటు రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది.

## తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూ

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో అమరావతిలో ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎస్‌ఎస్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్‌ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్‌ఎస్ ఏహెచ్‌ఈఆర్ ప్రో ఛాన్సలర్ డా.బి.సురేష్ సంతకాలు చేసి మార్చుకున్నారు. 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన జేఎస్‌ఎస్ విద్యాసంస్థకు భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయి. మైసూరు కేంద్రంగా ఉన్న జేఎస్‌ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జీూూాణజు=), నాక్ నుంచి ూాం గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయం. ప్రతిష్ఠాత్మక ఎన్‌ఐఆర్‌ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానంలో, ఓవరాల్‌గా 38వ స్థానంలో నిలిచి తన నాణ్యతను చాటుకుంది.

**10 వేల మంది విద్యార్థులకు అవకాశం**

ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ విభాగాల్లో మొత్తం 74 కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. క్యాంపస్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాక, 10 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. వీటికి అదనంగా హెల్త్‌కేర్‌లో ఏఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా నెలకొల్పనున్నారు.

**20 వేల ఉద్యోగాలు.. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా..**

ఈ ఒప్పందం ప్రకారం, తిరుపతిలో క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, చట్టబద్ధమైన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్–విండో విధానాన్ని కల్పిస్తుంది. క్యాంపస్ నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని జేఎస్‌ఎస్ మహావిద్యాపీఠమే భరిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఇది స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను అందిస్తుంది. ఈ కార్యక్రమంలో జేఎస్‌ఎస్ ఏహెచ్‌ఈఆర్ రిజిస్ట్రార్ డా.బి.మంజునాథ, డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కేపీఎంపీ అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

## విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!

ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)లో తిరుగుబాటు ఊహాగానాలు మరింత బలపడ్డాయి. పార్టీ విప్ జారీ చేసినప్పటికీ ఢిల్లీలో గురువారం నిర్వహించిన కీలక సమావేశానికి 9 మంది లోక్‌సభ ఎంపీల్లో కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో పార్టీ మరోసారి చీలిక దిశగా వెళుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది.

పార్టీ ఎంపీల కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభౌ వాజే మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీలు దూరంగా ఉండటం కలకలం రేపింది. ఈ పరిణామం ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరికపై వస్తున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. సమావేశానికి ముందు హాజరైన ఎంపీల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా స్పందించిన సంజయ్ రౌత్ గైర్హాజరైన ఎంపీలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లని, రాని వాళు ద్రోహులని మండిపడ్డారు. పార్టీని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నవారిపై కూడా రౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు, కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులతో తమను భయపెట్టలేరని వ్యాఖ్యానించారు. అవసరమైతే మళ్లీ జైలుకు వెళ్లేందుకూ సిద్ధమేనని చెప్పారు. ఆరుగురు ఎంపీల మద్దతుతో ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు కోరుతూ తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సంప్రదించినట్లు బుధవారం వార్తలు వెలువడ్డాయి. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు పొందాలంటే మూడొంతుల మద్దతు అవసరం. ప్రస్తుతం గైర్హాజరైన ఎంపీల సంఖ్య కూడా ఆ స్థాయిలో ఉండటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

అయితే ఇప్పటివరకు ఆయా ఎంపీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు ఈ వ్యవహారంపై ఏక్‌నాథ్ షిండే కూడా మౌనం పాటిస్తున్నారు. దీంతో మహారాష్ట్ర రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు.. ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!

- మొదటి పేజి తరువాయి

ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ. 12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## రైతు బీమా ఎగ్గొట్టే కుట్ర..

తెలంగాణలో రైతు సమస్యలను అధికార కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే... ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులనే కనుమరుగు చేస్తారని అన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో దాదాపు 7,600 మంది రైతులు మరణిస్తే... వారికి అందాల్సిన రైతు బీమా డబ్బులు ఇప్పటివరకు రాలేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎల్‌ఐసీకి ఇన్స్యూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఈ క్లెయిమ్స్ ఆగిపోయాయనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇది కేసీఆర్ తీసుకొచ్చిన పథకం కాబట్టే... దీనిని ఎలాగైనా మూలనపడేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. చేతనైతే కొత్త పథకాలు తేవాలి తప్ప, ఉన్న పథకాలను చెడగొట్టవద్దని హితవు పలికారు. మొత్తం 33 రకాల వడ్లు ఉంటే.. ప్రభుత్వం కేవలం 7 రకాల వడ్లను మాత్రమే బోనస్‌కు గుర్తిస్తోందన్నారు. అయితే ఈ 7 రకాల వడ్లు సాగు చేస్తే ఎకరానికి కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని, అదే మిగతా 26 రకాల వడ్లు వేస్తే ఎకరానికి ఏకంగా 30 క్వింటాళ్ల పంట పండుతుందని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన ఆ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి నష్టపోతారని... అంటే ఒక్కో రైతు ఎకరానికి దాదాపు రూ. 24 వేల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

## పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే.. చట్టసభ నిర్ణయాలను ప్రభావితం చేశారు

- మొదటి పేజి తరువాయి

రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేరుగా జాతీయ అసెంబ్లీలోనే బాంబు పేల్చారు. పాక్ జాతీయ అసెంబ్లీ సమావేశాల్లో రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ... మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. నాడు ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న జనరల్ ఫైజ్ హమీద్‌కు ఇమ్రాన్ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని... ఆయన ఏకంగా నాటి స్పీకర్ నివాసంలో జరిగిన అధికారిక సమావేశాల్లో పాల్గొని చట్టసభ కార్యకలాపాలను, కీలక నిర్ణయాలను శాసించారని వెల్లడించారు. ఐఎస్ఐ ఒత్తిళ్ల కారణంగానే చట్టసభలో కొన్ని కీలక మార్పులు చేయాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా యాంటీ మనీలాండరింగ్ చట్ట సవరణ పూర్తిగా నిఘా సంస్థకు అనుకూలంగా, వారి ఆదేశాల మేరకే అమల్లోకి తెచ్చారని సంచలన నిజాలు బయటపెట్టారు.

అయితే ఇమ్రాన్ ఖాన్ కాలంలో ఐఎస్ఐ పెత్తనాన్ని తప్పుబట్టిన ఖవాజా ఆసిఫ్... తమ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం సైన్యంతో కలిసి 'హైబ్రిడ్' విధానంలో నడుస్తోందని సమర్థించుకున్నారు. ప్రస్తుతం తమ దేశంలో పౌర–సైనిక హైబ్రిడ్ పాలనా విధానం అమలవుతోందని, దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొనడం గమనార్హం. అంటే.. పేరుకు ప్రజా ప్రభుత్వం ఉన్నా, ఆర్మీ సపోర్ట్ లేనిదే తాము కూడా ఏమీ చేయలేమని ఆయన పరోక్షంగా ఒప్పుకున్నట్టయింది.

## గాదె సాయికృష్ణ ఘటనపై సీబీఐ ఎంక్వైరీ జరగాలి

- మొదటి పేజి తరువాయి

డిమాండ్ చేశారు జగన్. ఈ ఘటనలో ఏసీపీ, సీపీ సహా అందరి పాత్ర తేలాలని అన్నారు జగన్. సీఐ సస్పెన్షన్ అనేది కేవలం కంటితుడుపు చర్య అని అన్నారు. సీఐని అరెస్ట్ చేయకుండా సాయి తల్లితో బేరసారాలు ఆడతారా అని మండిపడ్డారు జగన్. పోలీసులు, జనసేన లీడర్లు సాయి తల్లిని ప్రలోభపెడుతున్నారని అన్నారు జగన్. ఒక సీఐ స్టేషన్ పరిధిలో నెలలోనే రెండు చావులు నమోదవ్వడం దారుణమని అన్నారు జగన్.

## 21 న రావాణాపల్లిలో సమితి సమావేశం .

**మండల సీపీఐ పార్టీ కార్యదర్శి ఉల్లి సూరిబాబు.**

**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 18:** కొయ్యూరు మండల సీపీఐ పార్టీ సమితి సమావేశం ఈ నెల 21 వ తేదీన రవాణాపల్లి లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కార్యదర్శి ఉల్లి సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అధితులుగా పాడేరు సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ హాజరవుతున్నట్టు సూరిబాబు తెలిపారు.ఈ అతి ముఖ్యమైన పార్టీ సమితి సమావేశానికి మండలంలోని అన్నీ ప్రాంతాల కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు విధిగా హాజరు కావాలని పార్టీ కార్యదర్శి ఉల్లి సూరిబాబు ఈ ప్రకటనలో పేర్కొన్నారు.




# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# కలెక్టర్ మేడం గారు...
# మాకు స్కూల్ టీచర్.. నేటికీ రాలేదు.



జాజుల బంధ పివిటిజి విద్యారుల మొర ...

**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 18:** మా గ్రామంలో పాఠశాల ఉందనేది పేరుకే అని ఏనాడు సక్రమంగా తెరవలేదని..ఈ ఏడాది స్కూల్స్ తెరిచి ఐదు రోజులవుతున్నా నేటికీ టీచర్ రాలేదంటూ ఆ ఆదివాసీ విద్యారులు మొరాపెడుతున్నారు. తమ పాఠశాల తీర్పించండి అంటూ జాజుల బంధ లో ఉన్న 34 మంది అమాయక పిల్లలు కలెక్టర్ అమ్మా కు వేడుకున్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని మూలపేట పంచాయితీకి చెందిన శివారు గ్రామమైన జాజుల బంధ లో ఏబై కి పైనే కుటుంబాలు జీవిస్తుండగా ఇక్కడ ఎప్పటి నుంచో పాఠశాల కావాలంటూ కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు, జిల్లా కలెక్టర్లు కు వేడుకోగా ఎట్టకేలకు గత ఏడాది మండల పరిషత్ పాఠశాలను కొత్తగా మంజూరు చేశారు. అప్పటి డి ఈ ఓ (బ్రామ్మజీరావు) , ఎం ఈ ఓ లు ఇక్కడ స్కూల్ ప్రారంభించారు. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయునికి నియమించామని డి ఈ ఓ ఏం ఈ ఓ కు ఆదేశించారు. దీంతో ఒక టీచర్ ఆ సంవత్సరంలో రెండు సార్లు మాత్రమే వచ్చి వాలంటీర్ ద్వారా స్కూల్ ను కొంత కాలం నడిపించాలని ఆ గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ ఏడాది స్కూల్ తెరిచి దాదాపు వారం రోజులు అవుతున్నా
. కనీసం టీచర్ ఎవరో తెలియదు
.రాలేదని జాజుల బంధ పివిటిజి విద్యారులంతా ఇక్కడ పాఠశాల ముందు బైటాయించి నిరసన తెలుపుతూ కలెక్టర్ అమ్మా మా పాఠశాల కు టీచర్ ను నియమించండి అంటూ వేడుకుంటున్నారు.

అలాగే అంగన్వాడీ సెంటర్ నుండి కొత్తగా స్కూల్ లో జాయిన్ అవ్వాలంటే 8 మంది పిల్లలు ఉన్నారు. అయినప్పటికీ ఇక్కడ పాఠశాలకు టీచర్ ఎవరో.. అసలు ఎవరువస్తారో.. రారో తెలియని పరిస్థితి ఏర్పడినట్టు ఆ పీవీటీజీ గ్రామస్తులు అంటున్నారు. గతంలో మాతృభూమి సంస్థ ద్వారా 70 వేల రూ.లతో స్కూల్ షెడ్ నిర్మాణం చేశారని తెలిపారు. కానీ ఇక్కడ టీచర్ రాకపోవటంతో పిల్లలు ఉండి కూడా చదువుకోలేక పశువులు కాస్తున్నట్టు పిల్లలు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా పాడేరు జిల్లా కలెక్టర్ మేడం గారు స్పందించి మా స్కూల్ కి టీచర్ ను పంపించి మాకు విద్యా నభ్యసించేటట్లు చూడాలని జాజుల బంధ పివిటిజి విద్యారులంతా,తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.34 మంది పిల్లలు ఉన్న మా స్కూల్ కి పుస్తకాలు,బట్టలు పంపిణీ చేసి మధ్యాహ్న భోజనం పథకం కూడా అందించే విధంగా కలెక్టర్ మేడం చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు వెంకటరావు,జగ్గారావు కొండతల్లి, తదితరులు కోరుతున్నారు.

## ఓటరు జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 18:** ఓటరు జాబితాలో 2002 సంవత్సరంలో నమోదుకాని వారికి ఎపిక్ నంబర్‌తో పాటు వారి తల్లిదండ్రులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని, లేనిపక్షంలో వారి ఓటు హక్కు రద్దయ్యే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ నేపథ్యంలో రింతాడ-2 పంచాయతీ పరిధిలోని ఏబులం, దుచ్చరపాలెం, పెద్దపాడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రింతాడ-2 పంచాయతీ జనసేన పార్టీ నాయకులు గబులంగి గణేష్, సాగిన బ్రహ్మాజీ పడాల్, వంద్రంగి సతీష్ పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, అవసరమైన పత్రాల వివరాలను ప్రజలకు వివరించారు.అదేవిధంగా బీఎల్ఓ లోత సత్యనారాయణ గ్రామాల్లో పర్యటించి ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన
## వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిర్మా పండన్న



**పార్టీ బలోపేతం, మన్యంలోని సమస్యలపై చర్చ**

**జి.మాడుగుల. పెన్ పవర్.జూన్ (18)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సిర్మా పండన్న గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు సిర్మా పండన్న తెలిపారు. అల్లూరి జిల్లాలోని మన్య ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలపై జగన్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని అధినేత సూచించినట్లు పేర్కొన్నారు.

## సైబర్ నేరాలు, గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్ జూన్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోని వారాంతపు సంతలో ప్రజలకు సైబర్ నేరాలు, గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జీకేవీధి సీఐ సుధాకర్ మరియు సైబర్ క్రైమ్ సీఐ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం వివిధ రూపాల్లో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మండల పరిధిలో ఇప్పటికే నాలుగు సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే గంజాయి వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా మరియు సమాజానికి కలిగే అనర్థాలను వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాలు మరియు మాదక ద్రవ్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో గూడెంకొత్తవీధి ఎస్సై సురేష్, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యోగా డేలో హాజరు కానున్న ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్

**ముంచంగిపుట్టు మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి పద్మారావు.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 18.**యోగా డే సందర్భంగా అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో, సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జరుగు మెగా రక్తదాన శిభిరం కార్యక్రమంలో అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర హాజరు కానున్నన్నారని వైసీపీ ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. ప్రజా ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో మండల ప్రజలు పాల్గొని రక్తదాన శిబిరానీ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 21న జరుగు ఈ రక్తదాన శిబిరంలో రక్త దానం చేసి ప్రాణ దాతలు కావాలని పద్మారావు అన్నారు.





# గోతులతో నిండిన దానిరంగిని కంజరితోట రోడ్డు

**వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది.**

**తక్షణమే రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి రోడ్డు మంజూరు చేయాలి.**

**ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్.**

**అరకులోయ పెన్ పవర్ 18:** అల్లూరి జిల్లా అరకు మండలం మాడగడ పంచాయతీ దాని రంగిని నుండి బస్కి పంచాయతీ కంజరు తోటవరకు రెండు రోజుల భారీ వర్షలకు 5 కి.మీ రోడ్డు పూర్తి ధ్వంసంఅయ్యింది. మాడగడ పంచాయతీ దాని రంగిని నుండి బస్కి పంచాయతీ కంజరు తోట వరకు గతంలో ప్రభుత్వం నిర్మించిన 5 కి.మీ దీ రోడ్డులి కోడల్ లైఫ్ పూర్తై శిథిలమై ఉంది. గత రెండు రోజుల భారీ వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయి, రాకపోకలకు అసాధ్యంగా మారింది.6 గ్రామాలు అంధకారంలో ఈ రోడ్డు తెగిపోవడంతో దాని రంగిని, బెడ్డ గుడా, దోబు రంగిని, కొర్ర గుడా, తెంగడ గుడా, కంజరు తోటలి వరకు సుమారు 6 గ్రామాలకు రవాణా కష్టాలు వర్ణనాతీతం, అంబులెన్స్, బడి పిల్లలు, రైతుల ఉత్పత్తులు అన్నీ నిలిచిపోయాయి. పీవీటిజి గ్రామాల ప్రాణాలకు ముప్పు ఈ 6 గ్రామాలకు ఆనుకొని పీవీటిజి గ్రామాలు ఉన్నాయి. మెయిన్ రోడ్డు తెగిపోవడంతో గర్భిణీలు, రోగులను డోలి మొత్తలు,కాళ్లపై మోసుకెళ్లే దుస్థితి. లక్ష్యమే ప్రశ్నార్థకం.గతంలో పాడేరు గ్రీవెన్స్ ఫిర్యాదు చేసిన నేటికీ రోడ్డు మరమ్మత్తు కోసం గత 3 ఏళ్లుగా కలెక్టర్ గారికి పలుమార్లు వినతులు ఇవ్వడం జరిగిందిలి. కానీ అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా ఇప్పుడు రోడ్డు పూర్తిగా ద్వంసం అయ్యింది.లింక్ రోడ్లతో మోసం, లింక్ రోడ్లు వేస్తున్నామని చెప్తున్నారు. కానీ మెయిన్ రోడ్డు అయిన ఈ 5 కి.మీ రోడ్డు శిథిలంగా ఉండగా, ౹ాయి+ గ్రామాలకు లింక్ రోడ్లు వేసిన ఎలాంటి ప్రయోజనం లేదు.వెంటనే దాని రంగిని కంజరు తోట వరకు 5 కి.మీ మెయిన్ రోడ్డును పునరుద్ధరించి, రోడ్డు సౌకర్యం కల్పించగలరని లేని పక్షంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో 6గ్రామాల ప్రజలతో కలిసి మండల కేంద్రంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కె. సుబ్బారావు జి. పరశురామ్ జి రామన్న గ్రామస్తులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ నూతన భవనాలు నిర్మించాలని వినతి

- అంగన్వాడి భవనాలు నిర్మాణాలకు కృషి చేస్తామన్నా సిడిపిఓ.
- శిథిలావస్థలో చేరటంతో పొంచి ఉన్న ప్రమాదం.
- టీడీపీ నాయకుడు చెండా బాబూజీ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 18.** మండలంలో గల మాకవరం పంచాయతీ పరిధిలో కుంబిరిపడ, మేభ, మాకవరం అంగన్వాడి భవనాలను మండల సిడిపిఓ యు విమల కుమారి పరిశీలించినట్లు టీడీపీ నాయకుడు చెండా బాబూజీ తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయులకు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో జరిగిన పిజిఆర్ఎస్ లో మాకవరం పంచాయతీ పరిధిలో కుంబిరిపడ, మేభ, మాకవరం తదితర గ్రామాలలో అంగన్వాడి భవనాలు శిథిలావస్థలో చేరాయని, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని వినతి పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ కు సమర్పించమని, ఈ నేపథ్యంలోనే గురువారం మండల ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి ఆయా గ్రామాలలో సందర్శించి, అంగన్వాడి భవనాలను పరిశీలించారన్నారు. అంగన్వాడీ భవనాలు శిథిలావస్థలో చేరడంతో వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తక్షణమే భవన నిర్మాణాలు చేపట్టాలని సిడిపిఓ కు తెలిపామన్నారు. తదనంతరం సిడిపిఓ మాట్లాడుతూ.. శిథిలావస్థలో చేరిన అంగన్వాడి భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి సంబంధిత అధికారులకు నివేదికను సమర్పిస్తామని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ప్రీస్కూల్ సక్రమంగా నిర్వహించాలని, బాలింతలకు, గర్భిణీలకు, చిన్నారులకు అందిస్తున్నా పోషకాహారాలు అంగన్వాడి కార్యకర్తలు సక్రమంగా అందించాలని ఆమె తెలిపారు. మండలంలో శిథిలావస్థలో చేరిన అంగన్వాడీ భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని, అంగన్వాడీ భవనాలు లేని గ్రామాలో భవనాలు మంజూరుకు నివేదికను ప్రభుత్వాన్ని సమర్పించినట్లు ఆమె పేర్కొన్నారు.



# పారిశ్రామిక ప్రాంతంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా సంబరాలు



**గాజువాక :పెన్ పవర్, జూన్ 18:** కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు నమ్మకాన్ని నిలబెట్టుకుందని పార్టీ శ్రేణులు వ్యాఖ్యానించారు.
విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు నిర్వాసితుల హక్కుల్ని పరిరక్షించేది కూటమి ప్రభుత్వం మాత్రమే
జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఉన్న గొడ్డలి పార్టీ రాష్ట్రానికి పెను ప్రమాదం. టిడిపి అధ్యక్షుడు పల్లా విమర్శించారు . సంక్షేమం ,పారిశ్రామిక అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టిస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.

గాజువాక క్లబ్ లో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన రెండేళ్ళ నమ్మకం అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా పెనలిస్ట్, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జనసేన గాజువాక ఇంచార్జి కోన తాతరావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల రాక్షస పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని రాష్టాన్ని అభివృద్ధి బాటలో నడుపుతుందన్నారు. దేశంలోనే రికార్డు స్థాయి లో పెన్షన్ లు ఇస్తున్నామని, అంతే కాకుండా దేశంలో ఎక్కడ లేని విధంగా మంచానికే పరిమితం అయినా వారికీ 15 వేల రూపాయలు ఇస్తున్నామని అన్నారు. అంతర్జాతీయ ఐటీ సంస్థలు అయినా గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, విశాఖపట్నం లో తన కార్యకలాపాలు ప్రారంభించాయని, మెగా డియస్సి ద్వారా 15 వేల టీచర్ నియామకాలు చేపట్టామన్నారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 13 వేల రూపాయలు ఇవ్వడం చారిత్రాత్మక మైన పథకం అన్నారు. ఈ రెండేళ్ల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని రాబోయే మూడేళ్లలో మిగిలిన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేలా పక్క ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకొని కార్మికులకు అండగా నిలబడ్డామని అన్నారు. ఈ అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు,పార్టీ లు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. గాజువాక నియోజవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శులు పుచ్చ విజయకుమార్ , అనంతలక్ష్మి కార్పొరేటర్లు దల్లి గోవిందరెడ్డి. పల్లా శ్రీనివాసరావు. గంధం శ్రీనివాసరావు. బోండా జగన్. రౌతు శ్రీనివాసరావు. రాజన్ రామారావు బొడ్డు నరసింహ పాత్రుడు జనసేన రాష్ట్ర నాయకులు గంధం వెంకట్రావు. తిప్పల రమణారెడ్డి. బిజెపి నాయకులు ఎన్ కృష్ణంరాజు. జనసేన నాయకులు కర్ణం కనకారావు రౌతు గోవిందరావు రాష్ట్ర డైరెక్టర్లు ఎశీశ్రీశ్రీఱ పెంట్రాజు. తమిళ్ విజయ్ కుమార్ గుర్రం.నూకరాజు కళావతి. శాలిని. రోహిణి గూడూరి శంకర్రావు. బాట శీను అధిక సంఖ్యలో టిడిపి జనసేన బిజెపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సకాలంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి- హౌసింగ్ పీడీ బి. బాబు

**జి.మాడుగుల. పెన్ పవర్.జూన్ (18)** ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబు సూచించారు. జి.మాడుగుల మండలంలోని మారుమూల ప్రాంతాలైన తాసేరుబయలు, గొందిగుడ, బీమాలోయ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జరుగుతున్న గృహ నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు.
గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం నిబంధనల ప్రకారం బిల్లులు సకాలంలో చెల్లిస్తుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఆలస్యం లేకుండా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మారుమూల ప్రాంతాల్లో గృహ నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు పాల్గొన్నారు.



# విశాఖను మత్తు సంస్కృతి కేంద్రంగా మార్చవద్దు



**విశాఖ బీచ్ లలో మద్యం విక్రయాలు వద్దే వద్దు**

**సరస్వతీ నిలయాలకు వేదిక ఉత్తరాంధ్ర ఆరోగ్యా ప్రధాయిని మన విశాఖ**

**వైఎస్ఆర్సిపి మహిళ అంగన్వాడి విభాగాలు**

**డిమాండ్**

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్18:** జిల్లా అంగన్వాడి విభాగం వైఎస్ఆర్సిపి మహిళ విభాగం ఆధ్వర్యంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కేకే రజాక్ ఆదేశాల మేరకు విశాఖపట్నం బీచ్ లో మద్యం విక్రయాలు కోసం బీచ్ షాక్స్ ఏర్పాటు చేయడం తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆర్కే బీచ్ కాళీ మాత టెంపుల్ ఎదురుగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు శ్రీదేవి వర్మ ,రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మళ్ళ ధన లతా మాట్లాడుతూ ..
జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు గారి ఆదేశాలు మేరకు విశాఖపట్నం బీచ్‌లలో మద్యం విక్రయాల కోసం బీచ్ షాక్స్ ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ మరియు అంగన్వాడి విభాగం ఖండిస్తోందని, ప్రశాంతత,ప్రకృతి సౌందర్యం, పారిశ్రామిక అభివృద్ధి, విద్యాసంస్థలతో ప్రత్యేక గుర్తింపు పొందిన విశాఖపట్నాన్ని మద్యం సంస్కృతికి కేంద్రంగా మార్చే ప్రయత్నాలను ప్రజలు అంగీకరించరని స్పష్టం చేశారు. మద్యం మరియు మత్తు పదార్థాల వినియోగం వల్ల మహిళలపై హింస, గృహహింస, లైంగిక దాడులు, రోడ్డు ప్రమాదాలు,యువత భవిష్యత్తు నాశనం వంటి సమస్యలు పెరుగుతున్నాయని, ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో నమోదవుతున్న మహిళలపై హింస కేసుల్లో గణనీయమైన భాగం మద్యపానంతో సంబంధం కలిగి ఉండటం ఆందోళనకరమన్నారు. విశాఖ గోవా కాదని, తనదైన చరిత్ర, సంస్కృతి, సామాజిక విలువలు కలిగిన నగరమని పేర్కొంటూ, బీచ్ షాక్స్ పేరుతో మద్యం విక్రయాలను ప్రోత్సహించే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం,ప్రభుత్వ విద్యా మరియు వైద్య రంగాలను బలోపేతం చేయడం, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరింది.
ఈ కార్యక్రమములో బయ్యావరపు రాధ,సత్యాల సాగరిక,చెరుకూరి రజిని , జియ్యని వెంకట సత్య,మజ్జి జ్యోతి,ఇప్పిలి పార్వతి , జయప్రద,బంగారమ్మ , పి జోషిలా, రామ లక్ష్మి , పద్మజ , కుసుమ,సంధ్యవరలక్ష్మి , వెంకట లక్ష్మి ,వసంత శ్రీదేవి , అనుష ఎమ్ వరలక్ష్మి తదితరు లు పాల్గొన్నారు .

## గంజాయి జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసే గంజాయి రవాణాకు దూరంగా ఉండి...!

- మంప ఎస్ ఐ శ్రీనివాస్ చౌడుపల్లి ప్రజలకు అవగాహన.




**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 18:** జీవితాలను నాశనం చేసే గంజాయి వంటి మారక ద్రవ్యాల జోలికి పోవద్దనీ, రవాణా కు పాల్పడవద్దంటూ ఎస్ ఐ శ్రీనివాస్ చౌడుపల్లి లో ప్రజలకు అవగాహన కల్పించారు. కొయ్యూరు మండలం, భూధరాళ్ల పంచాయితీ శివారు చౌడుపల్లి లో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కొన్నేళ్లుగా మొరపెడుతున్నా మీలో నేటికీ మార్పు రాకపోతే ఏలా అని ఎస్ ఐ శ్రీనివాస్ అన్నారు. గంజాయి వంటి మారక ద్రవ్యాల రవాణా కు పాల్పడి అనేక మంది అమాయిక గిరిజనులు జైలుకు వెళ్లి ఏళ్ళ తరబడి రాలేని పరిస్థితి చూస్తూన్న మీరు ఇప్పటికైన మారాలని హితవు పలికారు. గంజాయి సరఫరా చేయుటకు అమాయక గిరిజనులైన మిమ్మల్ని డబ్బు ఆశ చూపించడం, తద్వారా సులభంగా సంపాదించవచ్చనే భావన కల్పించటం చేయటం తో నే మీ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎస్ ఐ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సదస్సు లో రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ మరియు మహిళపై జరుగుతున్న నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సు లో సిబ్బంది సింహాద్రి, చిన్న పలువురు పోలీసులు పాల్గొన్నారు.

## సి ఓ ఇ ఇ టీ నిర్వహణ నైపుణ్యాల శిక్షణ తరగతులు

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్ 18:** సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ లో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫైనాన్స్ అండ్ మేనేజీరియల్ అకౌంటింగ్ శిక్షణ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి శిక్షణ తరగతులలో పాల్గొన్నారు.
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగానికి చెందిన ఏపీ ట్రాన్స్‌కో,ఏపీ జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఎన్ఆర్ఈడీక్యాప్ సంస్థల అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఇంధన రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు,ముఖ్యంగా ఎనర్జీ ట్రాన్సిషన్ నేపథ్యంలో ఉద్యోగులు నిరంతర అధ్యయనం, నూతన పరిజ్ఞానంపై అవగాహన, నిర్వహణ నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం,ఆర్థిక నిర్వహణ, నాయకత్వ లక్షణాల అభివృద్ధి ద్వారా సంస్థల పనితీరు మరింత మెరుగుపడుతుందని.
విద్యుత్ రంగం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగులను తీర్చిదిద్దేందుకు సీఓఈఈటి ద్వారా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు.
ఈ శిక్షణ కార్యక్రమానికి ఐఐఎం విశాఖపట్నానికి చెందిన అధ్యాపకులు డా. వికాస్ సంగ్వాన్, డా.తమలి చక్రబర్తి ప్రోగ్రామ్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తూ శిక్షణ అందిస్తున్నారు.

## ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 18:** ప్రభుత్వ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు వంచుల పంచాయతీలో ఓటర్ జాబితా పరిశీలన, వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిబాల బీఎల్ఓతో పాటు బూత్ ఇన్‌చార్జిలు కలిసి 27, 28 బూత్‌ల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటర్ జాబితాలో ఉన్న తప్పులు, ఒప్పులను ప్రజలకు వివరించి, అవసరమైన సవరణలపై అవగాహన కల్పిస్తూ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు బీఎల్ఓ మజ్జి ఆదినారాయణ, లకే సన్యాసిరావు, బూత్ ఇన్‌చార్జి మూర్ల లక్ష్మణరావు, టీడీపీ తెలుగు యువత అధ్యక్షులు మూర్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, తప్పుల్లేకుండా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## గాజువాక 190 బూత్ లో ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ



**గాజువాక : పెన్ పవర్, జూన్ 18:** పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజకవర్గం మండలం 67వ వార్డు శంకర్ నగర్ 190 బూత్ లో బిఎల్ఓ బాస్కరరావుతో కలిసి గాజువాక బిజేపి కన్వీనర్ , బిఎల్ఏ వన్ కరణంరెడ్డి నరసింగరావు ,బిఎల్ఏ టూ , మండల అధ్యక్షుడు ఒమ్మి రంగనాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారాలను నింపి తిరిగి బిఎల్ఓ కి అందించాలని సూచించారు. ఫారం 6 కొత్త ఓటు నమోదు కోసం, ఫారం 7 చనిపోయిన వారి ఓట్లను తొలగించడానికి , ఫారం 8 చిరునామా మార్పు కోసం నింపి బిఎల్ఓకి అందజేయాలని అన్నారు.

# “మహిళల భద్రత కంటే మద్యం వ్యాపారమే ముఖ్యమా?”

**ప్రశాంత విశాఖను మద్యం కేంద్రంగా మార్చొద్దు!**

**జీవో 363ను తక్షణం రద్దు చేయాలి**

**ఎంపీ భరత్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనం-- ఐద్వా**




**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 18:**విశాఖ సూర్యలంక బీచ్‌లలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 363 ను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తీవ్రంగా ఖండిస్తోంది.మహిళల భద్రత, యువత భవిష్యత్తు, విశాఖ సంస్కృతి, ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసే ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

జీవో 363 ను నిరసిస్తూ ఈరోజు గురువారం మద్దిలపాలెం బస్ కాంప్లెక్స్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో జీవో ప్రతుల దగ్ధం కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆర్.ఎన్. మాధవి, జిల్లా కార్యదర్శి వై. సత్యవతి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి. పద్మ, జిల్లా సహాయ కార్యదర్శి డి. కొండమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విశాఖ ప్రజల ఆకాంక్షలకు, మహిళల భద్రతకు, యువత ప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు.

విశాఖ ఎంపీ భరత్ చేసిన వ్యాఖ్యలను ఐద్వా తీవ్రంగా ఖండిస్తోంది.”అందరూ తాగుతున్నారు”, “తాగితే తప్పేంటి?”, “ప్రజలు తాగకపోతే ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?” అని మాట్లాడటం ఒక ప్రజాప్రతినిధికి ఏమాత్రం తగదు. ముఖ్యంగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఒక ప్రముఖ విద్యా సంస్థ అధినేతగా ఉన్న వ్యక్తి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత సిగ్గుచేటు. సమాజానికి మంచి విలువలు అందించాల్సిన స్థానంలో ఉన్నవారు మద్యం వినియోగాన్ని సమర్థించడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట.

ప్రభుత్వాల బాధ్యత ప్రజలను మద్యం వైపు ప్రోత్సహించడం కాదు. ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి, భద్రత, సంక్షేమాన్ని కాపాడడం. ప్రజలు తాగకపోతే ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించడం ద్వారా ప్రజల జీవితాలను మద్యం అమ్మకాలతో ముడిపెట్టే ప్రమాదకరమైన ఆలోచనను ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు ప్రోత్సహిస్తున్నారు.

ప్రజలు తాగకపోతే ఆదాయం తగ్గుతుందని ఆందోళన చెందుతున్న ప్రభుత్వం, ప్రజల ఆస్తులను, ప్రభుత్వ భూములను, సహజ వనరులను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెడుతున్నప్పుడు ప్రభుత్వానికి కలుగుతున్న నష్టాల గురించి ఎందుకు మాట్లాడటం లేదు? ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు కట్టబెట్టడం ద్వారా కోట్లాది రూపాయల ప్రజా సంపదను కోల్పోతున్నప్పుడు గుర్తుకు రాని ఆదాయం, మద్యం అమ్మకాల విషయంలో మాత్రమే గుర్తుకు రావడం దురదృష్టకరం.


ఇప్పటికే మద్యం కారణంగా మహిళలపై హింస, లైంగిక వేధింపులు, గృహ హింస, రోడ్డు ప్రమాదాలు, కుటుంబాల విచ్ఛిన్నం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బీచ్ తీరం వెంబడి మద్యం విక్రయాలను ప్రోత్సహించడం మహిళల భద్రతను మరింత ప్రమాదంలోకి నెట్టే చర్య. కుటుంబాలు, మహిళలు, పిల్లలు ప్రశాంతంగా గడిపే బీచ్ ప్రాంతాలను మద్యం విక్రయ కేంద్రాలుగా మార్చడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం.

విశాఖను గోవా తరహా మద్యం కేంద్రంగా మార్చే ప్రయత్నాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరు. విశాఖ ప్రత్యేకత దాని ప్రకృతి అందాలు, ప్రశాంతత, సాంస్కృతిక విలువలు. వాటిని ధ్వంసం చేసి మద్యం సంస్కృతిని రుద్దే ప్రయత్నాలను ఐద్వా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. మహిళలు, యువత, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులను సమీకరించి మరింత విస్తృత స్థాయిలో ఉద్యమాలు చేపడతామని ఐద్వా హెచ్చరించింది.

ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కె. కుమారి, భారతి.మౌనిక, ఆర్. వరలక్ష్మి, పుష్ప, గౌరి, శాంతి , హేమ లత, లక్ష్మీ,, మణి, బేగం, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి చంటి, కుమార్.కృష్ణారావు, సింహాచలం,.ప్రకాశరావు,లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఏసీ అన్నదాన సత్రం ప్రారంభం





**రాష్ట్రంలో తొలి ఏ సి అన్నదాన సత్రం గా కనకమహాలక్ష్మి దేవస్థానం**

**ప్రారంభించిన దక్షిణ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్**

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్ 18:**విశాఖ కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఏసీ అన్నదాన సత్రంను

ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్,రాష్ట్రంలోనే తొలి ఏసీ అన్నదాన సత్రంగా గుర్తింపు శ్రీ శ్రీ శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని

విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు.

గురువారం ఉదయం విశాఖ బురుజు పేటలో గల శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏసీ అన్నదాన సత్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు ఏసీ అన్నదాన సత్రం ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించారని, ఈ సందర్భంగా కందుల నాగరాజు, ట్రస్టీలకు కూడా అభినందలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలోనే శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఏసీ అన్నదాన సత్రాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నూతనంగా ఏర్పాటు అయిన ధర్మకర్తల మండలి సభ్యులు ఈ దేవస్థానం అభివృద్ధికి చేస్తున్న కృషికి అభినందలు తెలియజేసారు.

అలాగే దేవస్థానం చైర్మన్ కందుల నాగరాజు ఎక్కడ కూడా రాజీ పడకుండా అధికారులతో కలిసి సమన్వయంతో పని చేస్తూ ఆలయ అభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్నారని ప్రశంసలు అందజేశారు.

దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ ఏసీ అన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు.

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తాము కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సంభందించి కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహకారం మరువ లేనిదని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. అధికారులతో సమన్వయంతో కలిసి తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి,ధర్మకర్తలు జి.ఎల్లయ్య, టి.నాగమణి, ఎం.నాగసుధ, టి.వేణి కుమారి, ఆర్.శైలజ, ఎస్.రామారావు, డి.శ్రీకాంత్, ఈఈ సిహెచ్.వి.రమణ, ఏఈ కే.ఎస్.ఎన్.మూర్తి, జి.ఎల్లయ్య కింగ్, రామారావు, పర్యవేక్షకులు పద్మజ, అనురాధ, రమణ, పిఆర్వో ప్రసాద్, దాతలు ఏ.బాలకృష్ణ, సందీప్ జైన్, సతీశ్,రామారావు,తీగల తాతాజీ, కేదార్నాధ్, బదిరీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం

- రాష్ట్ర పరిధిలో 164 బృందాలు అన్ని జిల్లాల్లో పనిచేస్తున్నాయి
- :ఈస్ట్ ఏసీపీ లక్ష్మణ మూర్తి



**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్18:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన శక్తి యాప్ తో మహిళలకు భద్రత కల్పించనున్నట్లు ఏసీపీ లక్ష్మణ మూర్తి పేర్కొన్నారు. విశాఖ సింగ్ హోటల్ జంక్షన్,నెహ్రూ నగర్ వద్ద సెయింట్ జోషఫ్ సన్ నర్సింగ్ కళాశాల లో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం మహిళలకు

నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో ఈ యాప్ ఉన్న మహిళలకు సత్వరమే రక్షణ కల్పిస్తారని తెలిపారు. రాష్ట్రంలో 164 బృందాలు అన్ని జిల్లాల్లో పనిచేస్తున్నట్లు చెప్పారు. వీరందరూ పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శక్తి యాప్లో 16 రకాల అంశాలు ఉంటాయని ఎవరైనా ఫిర్యాదు చేసిన వెంటనే ఎనిమిది నుంచి పది నిమిషాల్లో పోలీసులు బాధితుల వద్దకు చేరుకుంటారన్నారు. యాప్ లో నిక్షిప్తమైన 112 ని డయల్ చేసి తమ ఫిర్యాదు తెలియజేయవచ్చని అన్నారు. మహిళలకు స్టేషన్కు వెళ్లకుండా దీని ద్వారా రిపోర్టు చేయగలిగే సౌలభ్యం ఉందన్నారు. ఇప్పటివరకు బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీ లక్ష్మి, మన్మధరావు, ఈస్ట్ సబ్ డివిజన్ శక్తి టీం ఏఎస్ ఐ కె శ్రీనివాసరావు, కన్నారావు,శ్యాం, కృష్ణ, రూప దేవిమహిళలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు

# పాఠశాలకు అభివృద్ధికి ఆర్ఎస్ స్వేచ్ఛ సంస్థ చేయూత

- వసతులు కల్పించి విద్యార్థులకు అండగా నిలిచిన ఆర్ఎస్ స్వేచ్ఛ సంస్థ సొసైటీ




**జి.మాడుగుల పెన్ పవర్ జూన్ (18)** అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం బుసిపల్లి ప్రభుత్వ గిరిజన పాఠశాల దుస్థితిని తెలుసుకున్న ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి చేయూత అందించింది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గుర్తించిన సంస్థ సభ్యులు స్థానిక గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు అవసరమైన వసతులను సమకూర్చారు. పాఠశాలకు రంగులు వేయడంతో పాటు విద్యార్థులకు బెంచీలు, దుస్తులు, పుస్తకాలు, పలకలు, వాటర్ బాటిళ్లు తదితర సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ అధ్యక్షురాలు కంటా స్వాతి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగేంద్రబాబు విద్యార్థుల పట్ల, పాఠశాల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ సేవలను గ్రామస్తులు అభినందిస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీ వాసవీ అమ్మవారికి వెండి కిరీటం సమర్పించిన డాక్టర్ కంచర్ల బాబీ దంపతులు






**కడియం, పెన్ పవర్, జూన్ 18:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం దివ్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 11:14 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రతిష్ఠా కార్యక్రమంలో భక్తులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ కంచర్ల బాబీ, శ్రీదేవి దంపతులు అమ్మవారికి సుమారు రూ.3 లక్షల విలువైన వెండి కిరీటాన్ని ఆలయ కమిటీకి సమర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ కంచర్ల బాబీ మాట్లాడుతూ జగన్మాత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సేవా భావం పెంపొందాలని కోరారు.ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో కడియం మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి నాగబాబు, జిల్లా అదనపు కార్యదర్శి వారణాశి శ్రీనివాస గుప్త, మహిళా విభాగం అధ్యక్షురాలు యెందూరి సీతా మహాలక్ష్మి, గ్రంధి సుజాత, సిగంశెట్టి కుమార్, పసలపూడి కుమార్, తమ్మన సత్తిబాబు, కంచర్ల మూర్తి, గ్రంధి నానబ్బులు, కంచర్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ సిబ్బంది సామర్థ్యాభివృద్ధికి శిక్షణ అవసరాల విశ్లేషణపై ప్రత్యేక కార్యక్రమం

**ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం : ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్**



**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 18:**మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు "పంచాయతీరాజ్ సిబ్బంది సామర్థ్య అభివృద్ధికి శిక్షణ అవసరాల విశ్లేషణ" అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయిలో పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట రామన్ మాట్లాడుతూ, శిక్షణ అవసరాల విశ్లేషణ ద్వారా సిబ్బంది ప్రస్తుత జ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, విధుల నిర్వహణ సామర్థ్యాలు, మెరుగుపరచాల్సిన నైపుణ్యాలను గుర్తించవచ్చని తెలిపారు. ఆయా అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం ద్వారా పరిపాలన, ఆర్థిక నిర్వహణ, డిజిటల్ సేవలు, సంక్షేమ పథకాల అమలు, చట్టపరమైన అంశాల్లో సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించవచ్చని వివరించారు.

గ్రామ పంచాయతీల పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థాయిలో సుపరిపాలనను ప్రోత్సహించడం, పంచాయతీరాజ్ సంస్థలను మరింత శక్తివంతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామ స్వరూప్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమంలో సిబ్బందికి అవసరమైన నైపుణ్యాల అభివృద్ధిపై పలు అంశాలను వివరించి అవగాహన కల్పించారు.

# వలస చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

* 280 మంది విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ





**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 18:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అను విద్యా బ్యాంక్' ద్వారా వలస కూలీల చిన్నారులు, బిక్షాటన చేసుకునే చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు విద్య పట్ల ఆసక్తి పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం దాతల సహకారంతో పలకలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. సుమారు 280 మంది వలస కూలీల చిన్నారులు, బిక్షాటన చేసుకునే చిన్నారులు, పేద విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# కోనసీమ తిరుమలలో కొత్తపేట నూతన ఆర్‌డీఓకు స్వామివారి ఆశీస్సులు

* వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జి.వి.వి. సత్యనారాయణ



**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 18:**కోనసీమ తిరుమలగా భక్తుల ఆరాధన పొందుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొత్తపేట నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) జి.వి.వి. సత్యనారాయణ గురువారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆలయాన్ని సందర్శించిన ఆయనకు దేవస్థాన అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు నిర్వహించిన అనంతరం ఆర్‌డీఓ సత్యనారాయణ తీర్థప్రసాదాలు స్వీకరించి ఆలయ విశిష్టత గురించి అధికారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేదాశీర్వచనం అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆర్‌డీఓను ఘనంగా సత్కరించారు. ఆలయ పరిపాలన, భక్తులకు అందుతున్న సేవలపై అధికారులు సంక్షిప్తంగా వివరించినట్లు తెలిసింది.

ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. కొత్తపేట నూతన ఆర్‌డీఓగా బాధ్యతలు చేపట్టిన జి.వి.వి. సత్యనారాయణ స్వామివారి దర్శనంతో తన సేవలను ప్రారంభించడం విశేషంగా నిలిచింది.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

**ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్న సుభాష్**



**శంఖవరం, పెన్ పవర్ జూన్ 18:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో శంఖవరం మండలం వజ్రకూటం ప్రాథమికోన్నత పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర నూతన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వజ్రకూటం మాజీ సర్పంచ్, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్ హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కీర్తి వెంకట సుభాష్ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితానికి పునాది అని, చిన్న వయసులోనే చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై నిరంతరం దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆర్ టి సి బస్సులు సిబ్బంది సొంత పనులకా! లేక ప్రయాణికుల కోసమా?



**డుంబ్రిగుడ, పెన్ పవర్, జూన్ 18:** పాడేరు డిపో కి సంబంధించిన ఆర్టీసీ బస్సులు సిబ్బంది యొక్క సొంత పనుల నిమిత్తం ఎక్కడపడితే అక్కడ బస్సులను ఆపి తమ సొంత పనులను చేసుకుంటున్నారని ప్రయాణికులు, ఉద్యోగస్తులు,

మరియు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విధంగా ఆర్టిసి సిబ్బంది తమ సొంత పనుల నిమిత్తం ఎక్కడపడితే అక్కడ ఆపి టిఫిన్ మరియు టీ ల కని ఆర్టీసీ బస్సులను ఆపుకోవడం వలన ఉద్యోగస్తులు క్రమ విధులకు మరియు విద్యార్థులు పాఠశాలలకు మరియు కాలేజీలకు సమయానికి వెళ్ళలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది తోటి ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఆర్టీసీ అధికారులు సిబ్బందికి తగు శిక్షణలు మరియు సలహాలు ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. ముఖ్యంగా గుంటసీమ మరియు లోతేరు గ్రామాలకు నడపబడుచున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ మరియు కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ప్రజాసేవే నా జీవితం.. ప్రజల ప్రేమే నా బలం



మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్, జూన్ 18:**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 17న రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 100 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించి వేలాది మంది పేదలకు అండగా నిలవడం తన జీవితంలో మరపురాని ఘట్టమని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, వృద్ధులకు వస్త్రాల పంపిణీ, ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన భగవంతునికి రుణపడి ఉంటానని తెలిపారు. రాజకీయంగా తనపై నమ్మకం ఉంచి ప్రజాసేవకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అత్యధిక మెజారిటీతో గెలిపించిన రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో 130 మంది మహిళలకు ఉపాధి కల్పించడం, 137 మంది అనాథ పిల్లల విద్యాభారాన్ని చేపట్టడం తనకు లభించిన గొప్ప పుట్టినరోజు కానుకగా అభివర్ణించారు. వారి జీవితాల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం చూడటం తనకు అపారమైన సంతృప్తిని ఇచ్చిందన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి ఆశీర్వదించిన అభిమానులు, కార్యకర్తలు, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల ప్రేమ, అభిమానం తనపై మరింత బాధ్యతను పెంచాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారత, యువత ఉపాధి, అనాథల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని, తన జీవితం పూర్తిగా ప్రజాసేవకే అంకితమని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో కార్యశాల



**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 18**

గండేపల్లి మండలం సూరంపాలెం లో గల ఆదిత్య విశ్వవిద్యాలయం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఏఐ టూల్స్ బై కేపీఎంజీ' అనే అంశంపై మూడు రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా కుల్దీప్ తివారి, ఆయుష్మాన్ ఘోష్ మరియు ఓంకార్ జగ్తాప్ పాల్గొని శిక్షణ అందించారు. మొదటి రోజు శిక్షణలో వివిధ రకాల ఏఐ పరికరాలు, వాటి ఉపయోగాలు మరియు ఆధునిక విద్యా బోధన విధానాలు వాటి ప్రాధాన్యత వివరించారు. ముఖ్యంగా "చాట్ జి పి టి " వంటి అధునాతన ఏఐ సాధనాలను ఉపయోగించి సమాచార సేకరణ, కంటెంట్ తయారీ, పరిశోధన మరియు బోధన ప్రక్రియలో మరింత సమర్థవంతంగా నిర్వహించే విధానాలు నిపుణులు వివరించారు. అలాగే ప్రస్తుతం ఏఐ యుగంలో ప్రాధాన్యత సంతరించుకుంటున్న మల్టీ ఏజెంట్ వర్క్‌ఫ్లో గురించి వివరించారు. ఇందులో అనేక ఏఐ ఏజెంట్లు కలిసి ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించేందుకు వివిధ పనులను విభజించుకుని పూర్తి చేసే విధానం, దీని ద్వారా పరిశోధన, సమస్య పరిష్కారం మరియు ఆటోమేషన్ ప్రక్రియలు ఎలా మెరుగుపడతాయో ఉదాహరణలతో తెలియజేశారు. ప్రస్తుత సమాజంలో, ముఖ్యంగా విద్యా బోధనా రంగంలో ఏఐ టూల్స్ పాత్ర ఎంత ముఖ్యమైనదో వారు క్లుప్తంగా వివరించారు. ఈ రోజుల్లో 'ప్రాంప్ట్ ఇంజినీరింగ్' అనే అంశంపై అధ్యాపకులు పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ రంగంలో చేసే పరిశోధనలు భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు ఉదాహరణలతో వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆదిత్య విశ్వవిద్యాలయానికి చెందిన సుమారు 200 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం అధ్యాపకులు తమకు ఉన్న పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఐ వీరాంజనేయులు, వి సతీష్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్, సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ (స్కూల్ అఫ్ కంప్యూటింగ్) డాక్టర్ ఎం వి రాజేష్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజా బాబు, డిప్యూటీ హెడ్స్ డాక్టర్ ఏ లక్ష్మణ రావు, యస్ నీలిమ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి రూ.5,011 విరాళం

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న విశాఖపట్నం దంపతులు




**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 18:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ర్యాలి గ్రామంలోని చారిత్రాత్మక శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఐదు బుధవారాలు స్వామివారిని దర్శించుకుంటే భక్తుల కోరికలు నెరవేరుతాయనే ప్రగాఢ విశ్వాసంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో విశాఖపట్నానికి చెందిన బీశెట్టి వెంకట అప్పారావు, సత్యవతి దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాలస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.5,011లను విరాళంగా సమర్పించారు. భక్త దంపతులను ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ అసిస్టెంట్ అధికారి వై. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేసి సత్కరించారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆలయ అధికారులు తెలిపారు.

# రామచంద్రపురం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట





**రామచంద్రపురం, పెన్ పవర్, జూన్ 18:**రామచంద్రపురం పట్టణ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ పేర్కొన్నారు. పట్టణంలోని 4వ వార్డులో రూ. 5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న హెచ్‌డీబీ పైప్‌లైన్ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దూరదృష్టి, ప్రణాళికాబద్ధమైన కృషి వల్ల రామచంద్రపురం పట్టణంలో వేగవంతమైన అభివృద్ధి జరుగుతోందన్నారు. గత రెండేళ్లలో పట్టణ అభివృద్ధి కోసం సుమారు రూ. 40 కోట్ల నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. ఏళ్ల తరబడి ప్రజలను వేధించిన తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మంత్రి సుభాష్ చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ మంచి పాలన అందిస్తోందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో రామచంద్రపురం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దివ్యాంగుల కోసం ఈ నెల 20న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 18, :**జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఈ నెల 20న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.
గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ శనివారం కాకినాడ కలెక్టరేట్ ప్రజావాణి హాలులో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా పెన్షన్లు,సహాయ పరికరాల మంజూరు, విద్య,ఉపాధి,ఆరోగ్య సేవలు,సంక్షేమ పథకాలు మరియు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై తమ వినతిపత్రాలు, దరఖాస్తులు,అర్జీలను నేరుగా సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల కాకినాడ జిల్లాలోని దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు. ఇది పత్రికా ప్రచురణకు అనువైన శైలిలో సవరించబడింది.

## ప్రెస్ క్లబ్ సేవలు ప్రశంసనీయం



**జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్, జూన్ 18:**కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ముద్రించిన, పంచాంగకర్త బ్రహ్మశ్రీ సరిపెల్ల వెంకట శ్రీరామచంద్ర మూర్తి సిద్ధాంతి విరచిత శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని గురువారం జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి మోహన్, సీనియర్ జర్నలిస్టులు, అడ్వైజరీ కమిటీ సభ్యులు అంజిబాబు, దురానీ, కృష్ణ, ఆకెళ్ల శ్రీనివాస్, సతీష్, బన్నీ, వీరు తదితరులు పాల్గొన్నారు.

## పెనుమళ్ళ గ్రామంలో సీసీ డ్రైన్ల నిర్మాణానికి భూమిపూజ



**కాజులూరు, పెన్ పవర్, జూన్ 18:**కాజులూరు మండల పరిధిలోని పెనుమళ్ళ గ్రామంలో గురువారం సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. శెట్టిబలిజ రామాలయం నుండి ఎస్సీ పేటలోని పెంకే సూరిబాబు ఇంటి వరకు 195 మీటర్ల పొడవున రూ. 4.50 లక్షల వ్యయంతో, అలాగే అమలదాసు చిట్టెమ్మ ఇంటి నుండి వైఎస్సార్ విగ్రహం--పెనుమళ్ళ రోడ్డు వరకు 145 మీటర్ల పొడవున రూ. 6.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మురుగుకాలువలకు మొత్తం రూ. 11 లక్షల నిధులతో పనులు చేపట్టనున్నారు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఏడీ మంజూరు చేసిన నిధులతో, మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పట్టాభి,డీసీ పేపకాయల నారాయణరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చక్కపల్లి సూర్యనారాయణ,అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి వనం వీరబ్రహ్మం,దంతులూరి సూర్య నారాయణరాజు,నరాల శ్రీను,పంతగడ వాడపల్లి,గుబ్బల చిట్టిబాయి, పులిదిండి చంద్రశేఖర్,వార శ్రీను తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబుకు అభినందనలు



**కాజులూరు, పెన్ పవర్, జూన్ 18:**రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ఎన్నికైన సానా సతీష్‌బాబును కాజులూరు మండలం బందనపూడి మాజీ సర్పంచ్ దేగల తిరుమలవేణి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని కొనియాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో విశేష ప్రగతి సాధిస్తోందని పేర్కొన్నారు. అలాగే రాబోయే రోజుల్లో కూడా ఇదే సమన్వయం,అంకితభావంతో పనిచేస్తూ కాకినాడ జిల్లాను మరిన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సానా సతీష్‌బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు.

## ఎంవి ప్రసాద్, వసంత అక్క ఆశయాలను సాధిద్దాం -కామ్రేడ్ ఆనంద్



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 18:** జగ్గంపేటలో సిపిఐ ఎంఎల్ జనశక్తి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పి ఓ డబ్ల్యు రాష్ట్ర కన్వీనర్ కామ్రేడ్ ఎం.వి ప్రసాద్ వసంతక్కల 21వ వర్ధంతి సభ గురువారం జగ్గంపేటలోని ప్రసాద్ అన్న వసంతక్క స్థూపం వద్ద సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పందిరి ఆనంద్ ఆధ్వర్యంలో ప్రసాదన్న వసంత అక్క 21వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ అన్న వసంత అక్క చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని కొంతసేపు మౌనం పాటించారు. అనంతరం స్థూపం వద్ద పూలమాలలు వేసి,అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు ఆనంద్ మాట్లాడుతూ కామ్రేడ్ ప్రసాద్ అన్న వసంతక్కల మరణం తీరని లోటు అన్నారు. ప్రసాద్ అన్న నిర్మించిన ఉద్యమాన్ని కాపాడుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఆయన చనిపోయి 21 సంవత్సరాలు గడుస్తున్న ఇదే భూముల్లో ఉద్యమం కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బోలే ప్రభాకర్, ఉపాధ్యక్షులు జునిపే కృష్ణ, కార్యదర్శి సిల్లీ రాంబాబు, పిఓడబ్ల్యూ స్త్రీ విముక్తి నాయకురాలు వెలుగుల జయ, సరిచే సత్యనారాయణ, చెరగటం వెంకటరమణ, కాళ్ల వీరబాబు, బండి లక్ష్మి, పసుపులేటి అర్జునరావు, రామిశెట్టి రాంబాబురావు, వీరమల్ల వెంకయ్యమ్మ, నాదే ఎర్రమ్మ, బూసిరత్నం, తాతపూడి వీర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు



**కాకినాడ, పెన్ పవర్,జూన్ 18:** కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీని రాజ్యసభ సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యులుగా రెండోసారి ఎన్నికైన అనంతరం తొలిసారిగా కాకినాడ జిల్లాకు విచ్చేసిన సానా సతీష్‌బాబు,గొడారిగుంటలోని ఎమ్మెల్యే పంతం నానాజీ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ సానా సతీష్‌బాబుకు సాదర స్వాగతం పలికి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా మరోసారి ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తొలిసారిగా తన నివాసానికి విచ్చేసిన సానా సతీష్‌బాబును ఎమ్మెల్యే నానాజీ ఘనంగా సత్కరించారు. అనంతరం ఇరువురు నాయకులు జిల్లాలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరియు పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్,జనసేన పార్టీ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఒమ్మంగి శివారులో నాటు సారాతో వ్యక్తి అరెస్ట్.

- 20 లీటర్ల నాటు సారా స్వాధీనం.
- ప్రత్తిపాడు ఎస్సై,ఎస్ లక్ష్మీకాంతం



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 18:** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామ శివారులో నాటు సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 20 లీటర్లు నాటు సారాతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్తిపాడు ఎస్సై,ఎస్ లక్ష్మీకాంతం తెలిపారు. ఎస్సై,లక్ష్మీకాంతం తెలిపిన వివరాల ప్రకారం ఒమ్మంగి గ్రామ శివారులో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నాటు సారాను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు గురువారం సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో పెదశంకర్లపూడికి గ్రామానికి చెందిన దాట్ల లోవరాజు (36)ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 20 లీటర్లు నాటు సారాతో పాటు రవాణాకు ఉపయోగించిన టీవీఎస్ జూపిటర్ 125 స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై లక్ష్మీకాంతం ఈ సందర్భంగా తెలియజేసారు.

## కలెక్టర్ ఇచ్చిన హామీలకు సంబంధిత స్పందించిన అధికారులు






**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 18:**జిల్లా పర్యటన లో భాగంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ బుధవారం జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. దానిలో భాగంగా ఆసుపత్రి నిర్వహణపై ఆరా తీయగా అన్ని విధాల బేస్ అని అభినందించారు .అలాగే ప్రస్తుతం ఆసుపత్రికి కావలసిన అవసరాలను డాక్టర్ ప్రణీత్ తెలియపరచగా కలెక్టర్ స్పందించి గురువారం రోగులు ఇబ్బంది పడకుండా ఆసుపత్రి వద్ద ఆర్టీసీ బస్సు ఆపేందుకు ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ను ఏర్పాటు చేశారు. అలాగే మార్చరీలో కావలసిన ఫ్రైజర్ ను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి చెట్టు ప్రహరీ గోడ నిర్మించేందుకు కొలతను సంబంధిత అధికారులతో అందజేయగా . కలెక్టర్ స్పందించిన తీరుపై , ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ప్రణీత్ మరియు సిబ్బంది,ప్రజలు, రోగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి రూ.40 వేలు ఫైన్




**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 18:** రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఉత్తర్వులతో పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ ఆదేశాల మేరకు జగ్గంపేట సీఐ బి. తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్సై టి.రఘునాథరావు మరియు పోలీస్ సిబ్బంది బుధవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని గురువారం గౌరవ పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా నలుగురికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ. 40 వేల జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

## ఈనెల 21న నియోజకవర్గస్థాయి కూటమి పాలన విజయోత్సవాలు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 18**: జగ్గంపేట రావులమ్మ నగర్ టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై క్యాడర్ కు దిశానిర్దేశం చేశారు. ఈనెల 21 ఆదివారం పరిణయ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి రెండేళ్ల కూటమి పాలన విజయోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలన్నారు. జూన్ 25 నుండి 45 రోజుల పాటు నియోజకవర్గంలో ఉదయం, సాయంత్రం పర్యటన ఉంటుందని కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 14 నుండి సర్ కార్యక్రమం జరుగుతుందని బీఎల్ఏలు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇంచార్జ్‌లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదుపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రాబోయే 4 నెలలు కాలంలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, సొసైటీ ఎన్నికలు వస్తాయని ఓటర్ల నమోదు పెంచి స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగరవేయాలని నెహ్రూ అన్నారు .అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో 80 కార్లతో ర్యాలీగా కాకినాడలో జరుగుతున్న జిల్లా స్థాయి కూటమి ప్రభుత్వ విజయోత్సవ వేడుకలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్ వి ఎస్ అప్పలరాజు, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, పైడిపాల సూరిబాబు, తోట రవి, తోట గాంధీ, పాలచర్ల నాగేంద్ర చౌదరి, జంపన సీతారామచంద్ర వర్మ, దాసరి తమన్నా దొర తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28 న ఏలూరు లో దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కు సమర శంఖారావం విజయవంతం చేయండి....

### క్రైస్తవ సోదరులారా ఏకంకండి కాకినాడ జిల్లా జై భీమ్ రావు పార్టీ కాకినాడ అధ్యక్షులు తంటాటి కిరణ్ కుమార్





**శంఖవరం పెన్ పవర్, జూన్ 18:-** దళిత క్రైస్తవులు హక్కుల పరిరక్షణకు సమర శంఖం పూరించాల్సిన సమయం ఆసన్నమైందని జై భీమ్ భారత్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు తంటాటి కిరణ్ కుమార్ అన్నారు. మండల పరిధి అన్నవరం గ్రామంలో దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ సమితి సమావేశం గురువారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కిరణ్ కుమార్ మాట్లాడుతూ దళిత క్రైస్తవుల హక్కుల సాధన, రాజ్యాంగ బద్ధమైన అవకాశాల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం ఈ నెల 28న ఏలూరులో నిర్వహించనున్న "దళిత క్రైస్తవ సమర శంఖారావం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది, మాజీ న్యాయమూర్తి జడ శ్రవణ్ కుమార్ పిలుపు నిచ్చారు దీనిని అందరూ విజయవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు అందరూ ఏకం కావాలని పిలుపు నిచ్చారు.ఈ మహాసభకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదరులు, సంఘ పెద్దలు, పాస్టర్లు, సేవకులు, యువజన నాయకులు మరియు దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులను ఆహ్వానిస్తూ ప్రత్యేక కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధనకు చేపట్టాల్సిన అంశాలపై కార్యాచరణ, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాల్సిన ఈ సభలో విస్తృతంగా చర్చించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పార్టీ అధ్యక్షులు జడ శ్రవణ్ కుమార్ ఆదేశాల మేరకు, కాకినాడ జిల్లా అధ్యక్షులు తంటాటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. క్రైస్తవ సంఘాలను సందర్శించి కరపత్రాలను పంపిణీ చేస్తూ, సభ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. దళిత క్రైస్తవుల ఐక్యతను చాటిచెప్పే ఈ మహాసభలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాకినాడ జిల్లా లోని నియోజకవర్గం ప్రతి క్రైస్తవ కుటుంబాన్ని వ్యక్తిగతంగా సంప్రదిస్తూ, దళిత క్రైస్తవుల హక్కులు, సంక్షేమం, విద్యా, ఉపాధి అవకాశాల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ మహా శంఖారావంలో తప్పనిసరిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సమాజ అభ్యున్నతి, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, దళిత క్రైస్తవుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే ఈ సభ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది క్రైస్తవ సోదరులు, సోదరీమణులు ఈ కార్యక్రమానికి హాజరై తమ సంఘీభావాన్ తెలియజేయాలని కోరారు.

కార్యక్రమానికి ప్రతి క్రైస్తవ సోదరుడు, సోదరీమణి హాజరై విజయవంతం చేయాలని దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ మహా శంఖారావం సాదరంగా ముందుగా పాస్టర్ అసోసియేషన్ నిర్వాహకులు ఆహ్వానించారు.కార్యక్రమంలో శంఖవరం మండల ఆహ్వానించారు. వీరబాబు భీమరాజు తాతాజీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమంలో కాకినాడ జిల్లా అగ్రగామి





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 18:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా అమలయ్యాయని, అందులో కాకినాడ జిల్లా అగ్రగామిగా నిలిచిందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళా మందిరంలో గురువారం నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" విజయోత్సవ సభలో వారు మాట్లాడారు.కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.సభను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, అధ్యక్షత వహించగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ,గత రెండేళ్లలో ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు ప్రజాపాలనను సమర్థవంతంగా అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పి అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసిందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి విజయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ,ప్రభుత్వం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా 2.50 లక్షల మంది విద్యార్థులకు రూ. 364 కోట్లు, 'దీపం' పథకం కింద 17.05 లక్షల మందికి గ్యాస్ సిలిండర్లపై రూ. 146 కోట్ల సబ్సిడీ అందించినట్లు తెలిపారు. అలాగే స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, మత్స్యకార సేవ, ఆటోనగర్ సేవ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేసినట్లు వివరించారు.రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి కాకినాడ జిల్లా ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం పొందగలిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు,కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 18:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం ఈ నెల 19వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు తమ సేవా సంబంధిత సమస్యలు, వినతులను ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.అలాగే సంబంధిత జిల్లా అధికారులు మధ్యాహ్నం 3.45 గంటలకే ప్రజావాణి హాలుకు చేరుకుని కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.

## అంగన్వాడి కార్యకర్తలపై వేధింపులా..?

- జగ్గంపేట సీడీపీఓపై తీవ్ర ఆరోపణలు
- మానసిక ఒత్తిడితో ఉద్యోగాలు మానేస్తున్న వర్కర్లు, ఆయాలు -- చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సీడీపీఓ తీరుపై కార్యకర్తల ఆవేదన
- మానసిక ఒత్తిడితో ఇబ్బందులు
- టెక్నాలజీ వినియోగంలో సహకారం కరువు
- పోషణ వాటికల పరిశీలనపై వివాదం
- బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణ
- వైఖరి మారకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిక
- జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టులో అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం ఆరోపించింది. సీడీపీఓ వేధింపుల కారణంగా ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని సంఘం నాయకులు పేర్కొన్నారు.

**కాకినాడ, బ్యూరో (జగ్గంపేట), పెన్ పవర్ జూన్ 18 :** జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం జగ్గంపేట ప్రాజెక్టు అధ్యక్షురాలు రత్నం ఆరోపించారు. స్థానిక సీడీపీఓ వ్యవహార శైలి కారణంగా పలువురు కార్యకర్తలు ఆందోళనకు గురవుతుండగా, కొందరు ఉద్యోగం మానేయాలనే స్థితికి చేరుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు.


గురువారం విడుదల చేసిన ప్రకటనలో రత్నం మాట్లాడుతూ, ప్రాజెక్టు అధికారిగా అంగన్వాడి కేంద్రాల పనితీరును పర్యవేక్షించడం బాధ్యతేనని, అయితే ఆ పర్యవేక్షణ ఉద్యోగులను ప్రోత్సహించే విధంగా ఉండాలే గానీ వేధింపులకు గురిచేసేలా ఉండకూడదని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న తనిఖీలు, పరిశీలనలు కార్యకర్తల పనితీరును మెరుగుపరచడం కంటే వారిని మానసికంగా ఇబ్బందులకు గురిచేసేలా కనిపిస్తున్నాయని ఆరోపించారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా అంగన్వాడి కార్యకర్తలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారికి అవసరమైన శిక్షణ పూర్తిస్థాయిలో అందలేదని తెలిపారు. అయినప్పటికీ తమకు ఉన్న అవగాహనతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. అలాంటి సిబ్బందికి మార్గదర్శకత్వం ఇవ్వాల్సిన అధికారులు అసభ్యకర పదజాలంతో మాట్లాడటం, చిన్నచూపు చూడటం బాధాకరమని విమర్శించారు.

ముఖ్యంగా పోషణ వాటికల నిర్వహణ అంశంలో కార్యకర్తలను దుర్భాషలాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రత్నం పేర్కొన్నారు. ఐసీడీఎస్ పరిధిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, టేక్ హోమ్ రేషన్ , గుడ్లు, పాలు, బాలామృతం సరైన సమయంలో అందుతున్నాయా లేదా అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉందన్నారు. అలాగే ప్రీ-స్కూల్ విద్య, పిల్లల అభివృద్ధి, రికార్డుల నిర్వహణ వంటి కీలక అంశాలను సమీక్షించడం అవసరమని సూచించారు.

అయితే ఈ అంశాలపై దృష్టి పెట్టకుండా కార్యకర్తలను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, "ఉండండి లేకపోతే ఉద్యోగం మానేయండి" అనే విధంగా బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆమె తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా ఇదే ఉద్యోగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మహిళలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

గతంలో ఎన్నో ప్రాజెక్టు అధికారులు వచ్చినప్పటికీ కార్యకర్తలను, ఆయాలను గౌరవంగా చూసేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీడీపీఓ తమ వైఖరిని మార్చుకోకపోతే ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com